# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శుక్రవారం - 18 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 105 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## గురుకుల టెండర్లలో భారీ అక్రమాల ఆరోపణలు

- రూ.900 కోట్ల స్కామ్‌కు కాంగ్రెస్ తెరలేపింది: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- విద్యార్థులకు నాసిరకం సరుకులతో భోజనమని విమర్శ
- ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్

2లో

# ప్రజల భాగస్వామ్యంతో ప్రపంచస్థాయి తెలంగాణ నిర్మాణం

- ప్రజాపాలన దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ పిలుపు
- నాలుగు కోట్ల ప్రజలతో అభివృద్ధి లక్ష్యం
- సంక్షేమం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం
- భవిష్యత్ తెలంగాణకు భారీ ప్రణాళికలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు) :**

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. స్వేచ్ఛ, ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయమే ప్రజాపాలనకు పునాదులని వివరించారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 1948లో హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనమవడంతో ప్రజాస్వామ్య పాలనకు మార్గం సుగమమైందని గుర్తు చేశారు. తెలంగాణ నేల అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన యోధులకు పుట్టినిల్లుగా నిలిచిందన్నారు. ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, అస్తిత్వ పరిరక్షణ కోసం జరిగిన ఉద్యమాల ఫలితాలు ప్రతి కుటుంబ జీవితంలో కనిపించాలన్నారు. ప్రజల మాటకు విలువ ఇచ్చి వారి సమస్యలకు పరిష్కారం చూపడమే ప్రజాపాలన లక్ష్యమని స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేసి లక్షలాది రైతు కుటుంబాలకు ఉపశమనం కల్పించామని చెప్పారు. రైతు భరోసా కింద

మిగతా 2లో..



## పేదలకు స్థలాల పంపిణీ వేగవంతం చేయాలి

- మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం
- డంపింగ్ యార్డ్, స్మశాన వాటిక సమస్యల పరిష్కారంపై దృష్టి
- రహదారుల విస్తరణ, సేవల మెరుగుదలకు చర్యలు :మంత్రి పొంగులేటి

2లో

## విద్యా ప్రమాణాలు, వసతులపై ఆరా

- పాఠశాలలను సందర్శించిన భట్టి విక్రమార్క
- గణిత ఉపాధ్యాయుడి నియామకానికి ఆదేశం
- పబ్లిక్ స్కూల్స్ నిర్మాణాలపై సమీక్ష



**ఖమ్మం, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వనం వారి కృష్ణాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. పాఠశాలలో విద్యా పరిస్థితులు,

మిగతా 2లో..

# పేదింటి వైద్య విద్యార్థినికి కేటీఆర్ భరోసా

- వైద్య విద్యలో సీటు సాధించిన కొండేటి అకిరాకు అండగా నిలిచేందుకు హామీ
- సామాజిక మాధ్యమం ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లిన జర్నలిస్ట్ రాజేష్




**హన్మకొండ, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):**

పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని వైద్య విద్యలో సీటు సాధించగా, ఆమె చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా అండగా నిలిచేందుకు మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. వర్ధన్నపేటకు చెందిన కొండేటి అకిరా 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ సీటు సాధించారు. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం విడుదల చేసిన తాత్కాలిక సీట్ల కేటాయింపు ఉత్తర్వుల ప్రకారం మెదక్ జిల్లా పటాన్‌చెరు లోని మహే మహేశ్వర వైద్య కళాశాలలో అకిరాకు ఎంబీబీఎస్ సీటు కేటాయించారు. నీట్‌లో 389 మార్కులు సాధించిన అకిరాకు ఎస్సీ 2 మహిళా విభాగంలో సీటు లభించింది. అయితే పేద కుటుంబానికి చెందిన అకిరా వైద్య విద్యను కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని సీనియర్ పాత్రికేయుడు, తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక సంపాదకుడు బొల్లెపాక రాజేష్ సామాజిక మాధ్యమం ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

**"కేటీఆర్ సారు... ఆదుకోండి... డాక్టర్ అవుతా!" అంటూ అకిరా పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి కేటీఆర్ స్పందించారు. "సహాయం చేయడం సంతోషంగా ఉంది. కేటీఆర్ కార్యాలయం నుంచి మిమ్మల్ని సంప్రదిస్తారు" అంటూ భరోసా కల్పించారు. కేటీఆర్ స్పందనపై పాత్రికేయుడు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.**

కష్టపడి వైద్య విద్యలో సీటు సాధించిన అకిరా చదువుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకుండా సహాయం అందించేందుకు స్పందన రావడంతో ఆమె కుటుంబంలో ఆశలు చిగురించాయి. వైద్యురాలిగా ఎదగాలన్న అకిరా లక్ష్యానికి సహకారం అందించేందుకు స్పందించిన కేటీఆర్ పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

# విశ్వకర్మలకు అండగా ఉంటాం

- విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న కవిత
- స్వర్ణకారుల సమస్యలపై ప్రత్యేక ప్రస్తావన
- విశ్వకర్మ వృత్తుల అభివృద్ధికి హామీ
- అధికారంలోకి వస్తే కీలక నిర్ణయాల వాగ్దానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు)**

నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సమాజానికి చెందిన వివిధ వృత్తుల పరిస్థితులపై మాట్లాడిన ఆమె, విశ్వకర్మల జీవితాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు తమ పార్టీని ఆదరిస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే విశ్వకర్మ వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇచ్చే నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. విశ్వకర్మ సమాజంలోని మను, మయ, త్వష్ట, విశ్వజ్ఞ, శిల్పి వంటి ఐదు దాయిలకు చెందిన కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. సంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఈ వర్గాల సమస్యలను తాను దగ్గరగా గమనించానని, వివిధ సందర్భాల్లో చట్టసభల్లో కూడా వాటిని ప్రస్తావించినట్లు తెలిపారు. సంప్రదాయ వృత్తులను పరిరక్షించడం సమాజ బాధ్యత అని అభిప్రాయపడ్డారు. స్వర్ణకారుల సమస్యలను ప్రస్తావిస్తూ వాణిజ్య బంగారు

మిగతా 2లో..




## విమోచన వీరుల త్యాగాలు చిరస్మరణీయం



- భారత సమాఖ్యలో హైదరాబాద్ విలీనం చారిత్రక ఘట్టమని వ్యాఖ్య
- ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని పిలుపు

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు)**

తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో కలిసి పాల్గొన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# ప్రజల భాగస్వామ్యంతో ప్రపంచస్థాయి తెలంగాణ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. సన్న బియ్యానికి బోనస్ చెల్లింపు, భూ పరిపాలన సంస్కరణలు, పట్టాదార్ పాస్‌బుక్‌ల జారీ వంటి చర్యలను ప్రస్తావించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల సాధన కోసం ప్రభుత్వం న్యాయపోరాటం కొనసాగిస్తోందని వెల్లడించారు.

మహిళల ఆర్థిక సాధికారత కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, తక్కువ ధరకు వంటగ్యాస్, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలను వివరించారు. పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సామాజిక భద్రతా పింఛన్ల విస్తరణ వంటి చర్యలను గుర్తుచేశారు. వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో కుల సర్వే నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం బిల్లులు ఆమోదించినట్లు తెలిపారు.

విద్య, వైద్య రంగాలను ప్రభుత్వం రెండు కళ్లుగా భావిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆధునిక వసతులతో విద్యాసంస్థల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజన పథకాలను విస్తరించినట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, కొత్త ఆసుపత్రుల నిర్మాణం, వైద్య సేవల విస్తరణ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని వివరించారు. యువత కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్ తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, కృత్రిమ మేధస్సు కేంద్రాలు, పారిశ్రామిక కారిడార్లు, విమానాశ్రయాలు, మెట్రో విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో సమగ్ర అభివృద్ధి సాధించి ప్రపంచ స్థాయిలో తెలంగాణను నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



# విద్యా ప్రమాణాలు, వసతులపై ఆరా

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. విద్యార్థులు బాగా చదువుకుని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా అత్యుత్తమ విద్యా అవకాశాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణల వల్ల ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని అన్నారు. పాఠశాలలో అమలవుతున్న ఉదయం అల్పాహార పథకం, మధ్యాహ్న భోజన పథకాలపై భట్టి విక్రమార్క విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచి, పరిమాణం గురించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం రుచికరంగా, నాణ్యంగా అందుతున్నాయని విద్యార్థులు తెలిపినట్లు సమాచారం. విద్యార్థులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభ్యాసం మెరుగుపడుతుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడి కొరత ఉందని విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన భట్టి విక్రమార్క గణిత ఉపాధ్యాయుడిని నియమించే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి పాఠశాలలో బోధనా సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మధిర నియోజకవర్గంలో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పనులపై ఉప ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు, భూసేకరణ, నిర్మాణ ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన విద్యా సంస్థలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణ పనులు నవంబర్ మొదటి వారంలోగా ప్రారంభమయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో జాప్యం లేకుండా సమయపాలనతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి భావి తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.


# విశ్వకర్మలకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

దుకాణాల పెరుగుదలతో సంప్రదాయ స్వర్ణకారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్వర్ణకారుల జీవనోపాధిని కాపాడే చర్యలు అవసరమని అన్నారు. పుస్తెలు, మెట్టెలు వంటి సంప్రదాయ ఆభరణాలను స్వర్ణకారులే తయారు చేసి విక్రయించే విధానానికి సంబంధించిన ఫైల్‌పై మొదటి సంతకం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ చర్యల ద్వారా స్వర్ణకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. వడ్రంగులు, శిల్పులు వంటి ఇతర వృత్తిదారుల సంక్షేమంపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. వడ్రంగులకు బీమా సదుపాయాలు కల్పించాలని, శిల్పులకు దేవాలయ కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంప్రదాయ వృత్తులు కొనసాగించేందుకు ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందించాలని సూచించారు. వృత్తి ఆధారిత కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేందుకు ప్రత్యేక పథకాలు అవసరమని అభిప్రాయపడ్డారు. భూములు లేని వర్గాలకు భూమి పంపిణీ చేయాలనే లక్ష్యంతో భూలక్ష్మి పథకాన్ని రూపొందించినట్లు కవిత తెలిపారు. భూమిలేని కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఆలోచన తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ పథక రూపకల్పనకు పలువురు సామాజిక, విద్యా రంగ ప్రముఖుల ఆలోచనలు స్ఫూర్తినిచ్చాయని చెప్పారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభివృద్ధే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ప్రభుత్వాల ప్రోత్సాహం లేకపోయినా నాలుగు దశాబ్దాలుగా విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న కుల పెద్దలను కవిత అభినందించారు. విశ్వకర్మ సమాజం తమ సంప్రదాయాలను, ఆచారాలను కాపాడుకుంటూ ముందుకు సాగడం ప్రశంసనీయమని అన్నారు. విశ్వకర్మల కష్టాలు తెలిసిన వ్యక్తిగా వారి ఆశీర్వాదం కోరుతున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

# విమోచన వీరుల త్యాగాలు చిరస్మరణీయం

(మొదటి పేజీ తరువాయి)




హైదరాబాద్ విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన యోధుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని గవర్నర్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 17, 1948న అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ప్రజలు భారత సమాఖ్యలో భాగమైన చారిత్రక ఘట్టాన్ని గవర్నర్ గుర్తు చేశారు. ఇది భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయమని అన్నారు. హైదరాబాద్ రాష్ట్ర విలీనంతో ప్రజాస్వామ్య పాలనకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. దేశ సమైక్యతను బలోపేతం చేసిన ఘట్టంగా దీనిని అభివర్ణించారు.

హైదరాబాద్ విమోచన ఉద్యమంలో రైతులు, యువత, మహిళలు చేసిన త్యాగాలను గవర్నర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడిన వారి సేవలను తరతరాలు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల హక్కుల కోసం వారు చూపిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. సమాజ అభ్యున్నతికి వారి పోరాటం మార్గదర్శకమని అన్నారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని భారత సమాఖ్యలో విలీనం చేయడంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ పోషించిన కీలక పాత్రను గవర్నర్ కొనియాడారు. దేశ సమైక్యత కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు భారత చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించాయని పేర్కొన్నారు. జాతీయ సమగ్రత సాధనలో ఆయన చేసిన కృషిని దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు. సర్దార్ పటేల్ దూరదృష్టి భారత ఐక్యతకు బలమైన పునాదిగా నిలిచిందన్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవం కేవలం చరిత్రను గుర్తు చేసుకునే రోజు మాత్రమే కాదని, ఐక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువల పట్ల మన నిబద్ధతను పునరుద్ఘాటించే సందర్భమని గవర్నర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల ఆదర్శాలను అనుసరించి సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అందరూ కృషి చేయాలని సూచించారు. విమోచన యోధుల స్ఫూర్తితో అభివృద్ధి చెందిన తెలంగాణ నిర్మాణం దిశగా ముందుకు సాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రగతి, ప్రజల సంక్షేమం, సామాజిక ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిగా తీసుకుని అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# పేదలకు స్థలాల పంపిణీ వేగవంతం చేయాలి



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** పాలేరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో ఏదులాపురం మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమస్యలు, అభివృద్ధి అవసరాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ప్రణాళికాబద్ధంగా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను మంత్రి అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, స్మశాన వాటికల అభివృద్ధి వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించే కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పట్టణ అభివృద్ధిలో పరిశుభ్రత, మౌలిక సదుపాయాల మెరుగుదల కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి అర్హులైన నిరుపేదలకు ప్లాట్లు పంపిణీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. భూమిలేని కుటుంబాలకు గృహ స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సంబంధిత అధికారులు భూసర్వే ప్రక్రియను పూర్తి చేసి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో రహదారి సదుపాయాల అభివృద్ధిపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ప్రధాన జంక్షన్ల మధ్య ఉన్న రహదారులను విస్తరించడంతో పాటు జాతీయ రహదారి అనుసంధానంతో డబుల్ లైన్ రోడ్లను ఫోర్ లైన్లుగా అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారు. పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను ఒకే చోట అందించే అత్యాధునిక సమన్వయ కార్యాలయ నిర్మాణ పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. నూతనంగా మంజూరైన విద్యుత్ ఉపకేంద్రాల పనులపై కూడా చర్చించి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సేవలు ప్రజలకు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాధ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

# గురుకుల టెండర్లలో భారీ అక్రమాల ఆరోపణలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు)** గురుకుల విద్యాసంస్థల టెండర్ల వ్యవహారంపై బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో గురుకులాల్లో రూ.2,000 కోట్ల విలువైన అక్రమాలను తాము బయటపెట్టామని, ఇప్పుడు మరోసారి గురుకుల టెండర్లలో రూ.900 కోట్ల విలువైన అవకతవకలకు రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని ఆరోపించారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన కొనుగోళ్లు, టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆయన పేర్కొన్నారు. ప్రజాధనాన్ని సక్రమంగా వినియోగించాల్సిన చోట భారీ స్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఈ ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపించాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహారం, వస్తువులు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రవీణ్ కుమార్ అన్నారు. అయితే విద్యార్థులకు సరఫరా చేస్తున్న వస్తువుల నాణ్యతపై తీవ్ర సందేహాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ విషయంపై తల్లిదండ్రులు, ప్రజలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు కల్తీ లేదా నాసిరకం సరుకులతో భోజనం వండుతున్నారని ఆయన విమర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంతో రాజీ పడే పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆహార నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, టెండర్ల కేటాయింపులు పూర్తిగా పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల డబ్బుతో అమలు చేసే సంక్షేమ కార్యక్రమాల్లో అవినీతి, అక్రమాలకు తావు ఉండకూడదని పేర్కొన్నారు. ఆరోపణలపై సంబంధిత శాఖలు వివరణ ఇవ్వాలని కోరారు. గురుకుల విద్యార్థుల భవిష్యత్తు, సంక్షేమం దృష్ట్యా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థుల కోసం కేటాయించే నిధులు, సరఫరాల విషయంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# సంగారెడ్డిలో క్రీడా వేదిక ప్రారంభం

- ప్రభుత్వ వైద్య కళాశాలలో క్రీడా వేదిక ఆవిష్కరణ
- విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడిన మంత్రి
- విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం
- ఆరోగ్యవంతమైన భావితరాలే లక్ష్యమని వెల్లడి
- మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి, సెప్టెంబర్ 17, (తెలంగాణ ముచ్చట్లు):** సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన క్రీడా వేదికను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకుల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని క్రీడా వేదికను ప్రారంభించారు. కళాశాల ప్రాంగణంలో నెలకొల్పిన ఈ వేదిక విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యా ప్రగతితో పాటు శారీరక దృఢత్వానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి క్రికెట్ మైదానంలోకి వెళ్లి విద్యార్థులతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడారు. బ్యాట్ పట్టుకుని షాట్లు ఆడుతూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. మంత్రి క్రీడల్లో పాల్గొనడంతో విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం సందడిగా మారగా, విద్యార్థులు క్రీడా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చదువుతో పాటు శారీరక ఆరోగ్యంపైనా దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, మానసిక ఆరోగ్యానికి కూడా ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. వైద్య వృత్తిలో భవిష్యత్తులో సేవలందించే విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడా కార్యక్రమాలు జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందిస్తాయని మంత్రి తెలిపారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిస్తే సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని చెప్పారు. విద్యాసంస్థల్లో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆధునిక విద్యా సదుపాయాలతో పాటు క్రీడా వేదికలు, వ్యాయామ కేంద్రాలు, వినోద సదుపాయాలను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. క్రీడా వేదిక ప్రారంభంతో సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో అంతర్ కళాశాల క్రీడా పోటీలు, వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ వేదిక ఉపయోగపడనుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన, సమగ్ర వ్యక్తిత్వం కలిగిన భావితర వైద్య నిపుణులను తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# విమోచన దినోత్సవంగా సెప్టెంబర్ 17ను అధికారికంగా ప్రకటించాలి



- చారిత్రక వాస్తవాలను గౌరవించాలి
- రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోవాలి: మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ విమోచన కోసం పోరాడి ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులు, పోరాట యోధులకు ఘనంగా నివాళులర్పించారు. సెప్టెంబర్ 17ను "తెలంగాణ విమోచన దినోత్సవం"గా అధికారికంగా ప్రకటించకుండా "ప్రజాపాలన దినోత్సవం"గా నిర్వహించడం చారిత్రక వాస్తవాలను పక్కనపెట్టడమేనని మేయర్ అన్నారు. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా సెప్టెంబర్ 17ను అధికారికంగా "తెలంగాణ విమోచన దినోత్సవం"గా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలో నిలిచిన మురుగునీరు... దోమల దండయాత్ర!





- కృష్ణాజిగూడెం 3, 4 వార్డుల్లో నరకం చూస్తున్న ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ... కాలనీవాసుల ఆవేదన

**చిల్పూర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని కృష్ణాజిగూడెం గ్రామంలోని 3, 4 వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా మారాయి. డ్రైనేజీ కాలువల్లో మురుగునీరు నిలిచిపోవడంతో రోడ్లపైకి పొంగి ప్రవహిస్తోంది. ఇళ్ల పక్కనే పెద్ద గుంతలు ఏర్పడి మురుగు నీటి కుంటలుగా మారడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ సమస్యపై పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు, సర్పంచ్‌కు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని కాలనీవాసులు వాపోయారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు తమ సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామసభలో సైతం డ్రైనేజీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్య భయంతో జీవించాల్సి వస్తోందన్నారు.వెంటనే 3, 4 వార్డుల్లోని డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి, మురుగునీరు నిల్వ ఉండకుండా అవసరమైన చోట ఇంకుడు గుంతలు నిర్మించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. అదే విధంగా విద్యుత్ దీపాలు లేక రాత్రివేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కొత్తగా ఆరు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలు అమర్చాలని కోరారు.

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని కాలనీవాసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాగిల్లపురం వెంకటరాములు, సాదం శైలజ, సాదం రాధిక, భాగ్య, పద్మ, లక్ష్మి, సాదం చిన్న రాధిక, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మండలం అంతా రెపరెపలాడిన మువ్వెన్నెల జెండా



- ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**చిల్పూర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని చిల్పూర్ మండలం అంతటా వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.గురువారం ఉదయం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు.

అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన అంటే ప్రజల కోసం, ప్రజల భాగస్వామ్యంతో సాగించే పాలన అని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే లక్ష్యమని తెలిపారు.

వేడుకల్లో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణేశుడిని దర్శించుకున్న జనగామ వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్



**చిల్పూర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి గణనాథుడిని దర్శించుకున్నారు.గురువారం వినాయక మండపానికి చేరుకున్న డీసీపీకి ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం గణనాథుడికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో డీసీపీ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ స్వామివారికి మొక్కులు చెల్లించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు ఉత్సవ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కమిటీ సభ్యులు, నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీసీపీ సూచించారు. నిబంధనలకు అనుగుణంగా ధ్వని వ్యవస్థలను వినియోగించాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐ ఎస్. శ్రీనివాస్, ఎస్సైలు వినయ్ కుమార్, మనీషా, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# అస్తిత్వ పోరాటానికి ప్రతీక తెలంగాణ

- సాయుధ రైతాంగ పోరాటం నుంచి రాష్ట్ర ఆవిర్భావం వరకు చరిత్ర మరువలేనిది
- ప్రజా పాలన దినోత్సవం వేడుకల్లో :మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**కరీంనగర్, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు ):**తెలంగాణ కేవలం భౌగోళిక ప్రాంతం కాదని, అస్తిత్వ పోరాటానికి ప్రతీకగా నిలిచిన ప్రాంతమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ సత్తు మల్లేశం,జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, అస్తిత్వం కోసం దశాబ్దాలుగా అనేక పోరాటాలు చేశారని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన వరకు సాగిన ఉద్యమాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని అన్నారు. పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్లు, గృహజ్యోతి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు, రాజీవ్ ఆరోగ్యశ్రీ తదితర పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతోందన్నారు. వైద్య, విద్య, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లో జిల్లాకు మంజూరైన పలు అభివృద్ధి పనులను వివరించారు.జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీస్ సిబ్బంది, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, స్వాతంత్ర్య సమరయోధులు, జర్నలిస్టులు, జిల్లా ప్రజలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# పల్లగుట్టలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**చిల్పూర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని పల్లగుట్ట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ ఎం.డి. రఫీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు.

ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాపాలన అంటే ప్రజల భాగస్వామ్యంతో పాలన సాగించడమేనని తెలిపారు. అనంతరం గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులతో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిర నాగరాజుగౌడ్, చిల్పూర్ గుట్ట దేవస్థానం డైరెక్టర్ ఎనగందుల రత్నాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి



- తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంలో ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ

**మానకొండూర్, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు ):**తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ ప్రజాభవన్ కార్యాలయంలో ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విలీన దినోత్సవం రాష్ట్ర చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజని అన్నారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం కావడానికి దారితీసిన చారిత్రక పరిణామాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ చరిత్ర పోరాటాలు, త్యాగాలు, ప్రజల ఆకాంక్షలు, ప్రజాస్వామ్య విలువలతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం వంటి రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ ముందుకు సాగడమే ఈ దినోత్సవం ప్రధాన సందేశమన్నారు. ప్రజల హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం, అన్ని వర్గాల సమాన అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ కోసం పోరాడిన అమరవీరులు, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం త్యాగాలు చేసిన మహనీయులకు ఘన నివాళులు అర్పించారు.


# ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం




**పెద్దమందడి,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గురువారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం జాతీయ జెండాను ఆవిష్కరించి, నిజాం పాలనలో రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరులను స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛను అందించేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరయోధులకు నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసర ప్రాంతాలు, ఇళ్ల చుట్టుపక్కల, రహదారులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి స్రవంతి, ఉపసర్పంచ్ పానుగంటి రాములమ్మ, వార్డు సభ్యులు కావలి యాదమ్మ, పద్మమ్మ, పాఠశాల విద్యార్థులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ తిక్కన్న, భీమిరెడ్డి కొంకలి నరసింహ, పానుగంటి వెంకటయ్య, పానుగంటి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రేవంత్ రెడ్డి రాక్షసుడంటూ రాజయ్య ఫైర్




- **3,146 కొత్త గ్రామపంచాయతీల గుర్తింపు కేసీఆర్‌దే**
- **కడియం శ్రీహరి తన బిడ్డల భవిష్యత్తు కోసం నియోజకవర్గాన్ని వాడుకుంటున్నాడు: రాజయ్య**

**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తిన్నింటి వాసాలు లెక్కెడుతున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన బిడ్డల భవిష్యత్తు కోసం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు.

కడియం శ్రీహరి నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ అభివృద్ధి పనులు చేపట్టడం లేదని రాజయ్య విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తండాలు, గూడేలు, ఆవాసాలను గ్రామపంచాయతీలుగా గుర్తించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. గ్రామాలకు కడియం శ్రీహరి వస్తే ప్రజలు నిలదీయాలని, తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి రాజయ్య తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "రేవంత్ రెడ్డి రాక్షసుడు" అని వ్యాఖ్యానిస్తూ, ప్రజలకు సరైన పరిపాలన అందించడం లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఇంటింటికీ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రైతుబంధు పథకం ఆగలేదని గుర్తు చేశారు.

ప్రస్తుతం రైతుబంధు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, పెన్షన్లు సక్రమంగా అందడం లేదని రాజయ్య ఆరోపించారు. విద్యార్థులకు మోటార్‌సైకిళ్లు ఇస్తామని హామీ ఇచ్చి, మోటార్‌సైకిల్ కాదు కదా, దానికి సంబంధించిన టైర్లు కూడా ఇవ్వలేదంటూ ఎద్దేవా చేశారు.

రఘునాథపల్లి మండలం యాపలగడ్డ తండాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజయ్య పాల్గొన్నారు. తండాలు, గూడేలు, ఆవాసాలకు గ్రామపంచాయతీ హోదా కల్పించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతగా నిర్వహించిన పాలాభిషేక కార్యక్రమంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ తండాలు, గూడేలు, ఆవాసాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడం ద్వారా గిరిజనులకు స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. "మా తండాలో మా పాలన.. మా గూడేలో మా పాలన" అనే లక్ష్యంతో గ్రామపంచాయతీల ఏర్పాటు జరిగిందని తెలిపారు.

కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొర్ర రాజేందర్ నాయక్, రఘునాథపల్లి మాజీ ఎంపీపీ ఎర్రోళ్ల కుమార్ గౌడ్, మండల ఇన్‌చార్జి ముసిపట్ల విజయ్, గూడ కిరణ్, దుబ్బాక హరీష్ గౌడ్, యాక స్వామి, పాల్నాటి రాజిరెడ్డి, హరి నాయక్, బండి కుమారస్వామి, మట్లపల్లి సునీత రాధాకృష్ణ, సునీతతో పాటు ఎస్టీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, తండాల ముఖ్య నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# పెద్దమందడిలో తెలంగాణ విమోచన దినోత్సవం




- **మోడీ జన్మదిన వేడుకలు.. చిత్రపటానికి పాలాభిషేకం, అన్నదానం**

**పెద్దమందడి,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముప్పూరు చెన్నయ్య ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచన కోసం పోరాడిన యోధుల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ముప్పూరు చెన్నయ్య మాట్లాడుతూ.. తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన యోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. సెప్టెంబర్ 17కు చారిత్రక ప్రాధాన్యత ఉందని, విమోచన పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని చెన్నయ్య అన్నారు. జన్మదిన వేడుకల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



- **శ్రీ మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక హోమాలు**
- **వృద్ధులకు పండ్ల పంపిణీ ,విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ**

**కరీంనగర్, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు ):** దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గురువారం ఘనంగా నిర్వహించారు. సేవా దృక్పథంతో పలు కార్యక్రమాలు చేపట్టారు. ప్రధాని మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ స్థానిక శ్రీ మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయుష హోమం, గణపతి హోమం నిర్వహించి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. ప్రధాని మోదీకి దైవబలం తోడై, దేశానికి ఆయన అందిస్తున్న సేవలు మరింత కాలం కొనసాగాలని అమ్మవారిని ప్రార్థించారు. పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా సమాజ సేవకు ప్రాధాన్యమిస్తూ నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. రేపటి భారత పౌరులైన చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపుతూ వారి విద్యకు ప్రోత్సాహంగా నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశాన్ని విశ్వవేదికపై నిలబెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా ప్రధాని మోదీ కొనసాగిస్తున్న రాజకీయ ప్రస్థానం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రజలందరూ భగవంతుడిని ప్రార్థించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, KAPP చంద్ర, సోమిడి వేణు ప్రసాద్, కొంపల్లి శ్వేత రమణ్, ఎన్నం లక్ష్మీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఇన్‌స్పెక్టర్‌ను ఘనంగా సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు




**ధర్మసాగర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌కు నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనుముల శ్రీనివాస్‌ను ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గంగారపు శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో నాయకులు నూతన ఇన్‌స్పెక్టర్ అనుముల శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ మాదిగ మాట్లాడుతూ అనుముల శ్రీనివాస్ గతంలో ఇదే పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించారని తెలిపారు. ఆ సమయంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు శాంతిభద్రతల నిర్వహణలో సమర్థవంతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన గతంలో కంటే మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారి మన్ననలు, ఆశీస్సులు పొందాలని కోరారు.

ఈ సన్మాన కార్యక్రమంలో బొడ్డు శాంతి శాంతిసాగర్ మాదిగ, సింగారపు పవన్ మాదిగ, పొడిశెట్టి ప్రతాప్ మాదిగ, నక్క సుమన్ మాదిగ, పొడిశెట్టి సురేంద్ర మాదిగ, రామంచ ఏసు మాదిగ, మేక సృజన్ మాదిగ, సోంపల్లి అన్వేష్ మాదిగ, ఎండీ శంషాద్దీన్, మట్టెడ బాలు, గొల్లపల్లి అనిల్ మాదిగ, పుట్ట ప్రశాంత్ మాదిగ, పుట్ట దేవరాజు, పొడిశెట్టి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు సింగారపు దిలీప్ మాదిగ, సోంపల్లి ప్రవీణ్ మాదిగ, సోంపల్లి రాజేంద్ర మాదిగ, ఇమ్మడి ప్రమోద్ మాదిగ, బొక్క ప్రేమ్, బొడ్డు రాజు, బొడ్డు బన్నీ, నక్క ప్రవీణ్, పోలుమారి విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి చౌరస్తా, ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాలకుర్తి సోమశేఖర్, మండల ఉపాధ్యక్షుడు శివకృష్ణ, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు ప్రదీప్, జిల్లా నాయకుడు వేణు, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కొలనుపాక శరత్‌కుమార్, మండల నాయకులు పొన్న కుమార్, చిట్టీమల్ల నగేష్, బీజేపీ జిల్లా నాయకుడు నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన



- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కోసం జరిగిన పోరాటాలను స్మరించుకున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకంగా, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వనపర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజలకు మెరుగైన పాలన, సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జగతిపల్లి అంగన్వాడి కేంద్రంలో పోషకాహార వారోత్సవాలు



**పెద్దమందడి,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):**వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగతిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుధారాణి మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంటయ్య యాదవ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గాండ్ల తేలికుల సంఘం ఆధ్వర్యంలో మోదీ జన్మదిన వేడుకలు



**నిజామాబాద్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గాండ్ల తేలికుల సంఘం ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గాండ్ల తేలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇందల్వాయి కిషన్ స్థానిక పోతలింగయ్య ఆలయంలో ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఖిల్లా రామాలయం వద్ద మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఇందల్వాయి కిషన్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించి దేశానికి మరింత సేవలందించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామి దేశంగా నిలిపే దిశగా మోదీ నాయకత్వంలో మరింత అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గాండ్ల తేలికుల యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్, గాండ్ల తేలికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్‌తో పాటు సంఘం నాయకులు, కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవడం సమంజసం కాదు

- **మల్లికుదుర్ల గ్రామంలో బాధితుడి ఆవేదన**



**వేలేరు, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో సట్ల.యాదగిరి తన స్థలం లోనే నిర్మించుకుంటున్న ఇంటి నిర్మాణ పనులను అడ్డుకోవడం సమంజసం కాదని బాధితుడు యాదగిరి తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన యాదగిరి అనే వ్యక్తి తనకు సంబంధించిన స్థలంలోనే ఇల్లు నిర్మాణం చేపట్టారు. అయితే ఇంటికి ఒక ప్రక్క స్థలంలో మెట్లు నిర్మించుకుంటుండగా గ్రామంలోని వార్డు ప్రజలు అడ్డుకుంటున్నట్లు తెలిపారు. అయితే మెట్లు కట్టుకోవడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగదని బాధితుడు యాదగిరి తెలిపారు. గతంలో తన ఇంటి ప్రక్కన నుండి ప్రభుత్వం సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా తానే స్వచ్ఛందంగా 3ఫీట్ల స్థలం వదిలిపెట్టానని అన్నారు. రోడ్డు వెడల్పు కోసం తన స్థలాన్ని ఇచ్చిన తాను ఇప్పుడు రోడ్డును ఎందుకు అక్రమించే విధంగా నిర్మాణం చేపడతానని పేర్కొన్నారు. వార్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకున్నా తన ఇంటి నిర్మాణ పనులను అడ్డుకోవడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

## మోజెర్ల ఉద్యాన కళాశాలలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**పెద్దమందడి,సెప్టెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల ఉద్యాన కళాశాలలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సహాయ ప్రాంగణాధిపతి డాక్టర్ వీణా జోషి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.1948లో తెలంగాణ ప్రాంతం భారత సమాఖ్యలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని ప్రజా పాలన దినోత్సవం గుర్తుచేస్తుందని ఆమె అన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమం, ఆకాంక్షల కోసం కృషి చేసిన నాయకులు, ప్రజల త్యాగాలను స్మరించుకోవాలని పేర్కొన్నారు. వారి ధైర్యం, అంకితభావం, సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు.విద్యార్థులే తెలంగాణ, దేశ భవిష్యత్తుకు బలమని పేర్కొంటూ క్రమశిక్షణ, నిజాయితీ, జ్ఞానం, బాధ్యతాయుత పౌరసత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అధ్యాపకులను గౌరవిస్తూ, కళాశాల నియమాలను పాటించి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఉద్యాన విద్యార్థులు తాము పొందిన శాస్త్రీయ పరిజ్ఞానం, ప్రాయోగిక నైపుణ్యాలను రైతుల జీవనోపాధి మెరుగుదలకు, వ్యవసాయ అభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు. సహజ వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సుస్థిర వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.త్యాగాలు చేసిన వారి వారసత్వాన్ని గౌరవిస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి, శాంతియుత, సుసంపన్న, అభివృద్ధి చెందిన తెలంగాణ నిర్మాణానికి కృషి చేయాలని డాక్టర్ వీణా జోషి ఆకాంక్షించారు.కార్యక్రమంలో బోధనా, బోధనేతర, ఒప్పంద సిబ్బందితో పాటు పట్టభద్ర స్థాయి, డిప్లొమా విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

- **388 ఎకరాల భూమిని దళిత కుటుంబాలకు పంచుతామన్న ప్రకటనపై హర్షం**



**హుజురాబాద్, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో 388 ఎకరాల భూమిని 800 దళిత కుటుంబాలకు పంచుతామని ప్రకటించడాన్ని హర్షిస్తూ హుజురాబాద్ మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ సందమల్ల పుణ్యబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దళితులు తమ సమస్యలను తెలియజేయడానికి చేపట్టిన నిరసన కార్యక్రమాల సందర్భంగా వారిని అవమానించేలా వ్యవహరించడం సరికాదన్నారు.
దళితులు నడిచిన నేలను పసుపు నీటితో శుద్ధి చేసిన ఘటనను వారు తప్పుబట్టారు. అదే భూమిని దళిత కుటుంబాలకు పంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం దళితుల పట్ల ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించే వారిని అన్ని వర్గాల ప్రజలు ప్రశ్నించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. దళితుల సమస్యలపై బీఆర్ఎస్‌లో ఉన్న దళిత నాయకులు, కార్యకర్తలు స్పందించాలని కోరారు. దళితుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సందమల్ల నరేష్, జంగ అనిల్, దుబాసి బాబు, బత్తిని రవీందర్ గౌడ్, మోరే ఉపేందర్, కేఆర్ బిక్షపతి, కొలుగూరి సమ్మయ్య, ఎర్ర వంశీ, గద్దల కార్తీక్, వరుణ్, అన్వేష్, శ్రీకాంత్, ప్రభాకర్, కీర్తన్ తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించాలి

- **నర్సింగ్ షాప్, పారామెడికల్, శానిటరీ సెంటర్లను వినియోగంలోకి తేవాలి: బీసీ జేఏసీ**



**హుజురాబాద్, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు అవసరమైన కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ నాయకులు కోరారు. ఆసుపత్రిలో నర్సింగ్ షాప్, పారామెడికల్, శానిటరీ సెంటర్లను వినియోగంలోకి తీసుకువచ్చి రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు విజ్ఞప్తి చేశారు.
ఇటీవల బీసీ జేఏసీ నాయకులు హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా అక్కడ చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రోగులు తమ ఆవేదనను వ్యక్తం చేసినట్లు నాయకులు తెలిపారు.
లిఫ్ట్ పనిచేయక రోగులకు ఇబ్బందులు
ఆసుపత్రిలో లిఫ్ట్ పనిచేయకపోవడంతో ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న రోగులు, వారి సహాయకులు మెట్లు ఎక్కడం, దిగడం కష్టంగా మారిందని బీసీ జేఏసీ నాయకులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా లిఫ్ట్ అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.
తాగునీటి సౌకర్యం కల్పించాలి
ఆసుపత్రిలోని వాటర్ ఫిల్టర్, ఫ్రిడ్జ్ పనిచేయకపోవడంతో రోగులు, వారి వెంట వచ్చిన బంధువులు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఆసుపత్రి నిర్వహణపై సరైన పర్యవేక్షణ ఉండేలా చూడాలని, అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.
రోగుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించి ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో మరింత నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.
ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మావునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్‌లో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

- **విశ్వకర్మ జయంతి, ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు**
- **ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**



**హుజురాబాద్, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు ):** భారతీయ జనతా పార్టీ హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం, విశ్వకర్మ జయంతి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.
తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని హుజురాబాద్ డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.
అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు.
ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రామాలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమాలకు బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, తూముల శ్రీనివాస్, సెంట్రల్ ఫిలిం బోర్డు మెంబర్ సబ్బని రమేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులు తిప్పబత్తిని రాజు, గంట సంపత్ తదితరులు పాల్గొన్నారు.
అలాగే సీనియర్ నాయకులు కళ్లెపు సుధాకర్ రావు, మెరుగు రాజిరెడ్డి, కొలిపాక శ్రీనివాస్, పోతుల సంజీవ్, అంకటి వాసు, మంచికట్ల మురళి, పదారి సుమన్, పదారి కొమురయ్య, అజార్, పట్టణ ఉపాధ్యక్షులు యల్ల సంజీవరెడ్డి, ఇల్లందుల ప్రణీత్, ఈదులకంటి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎర్ర శ్రీధర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కొలిపాక వెంకటేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కుతాడి కుమారస్వామి, యువ మోర్చా అధ్యక్షుడు మోటపోతుల రాకేష్, పార్టీ కార్యదర్శులు కొడిమ్యాల పవన్ కుమార్, గుర్రం సంతోష్, కొలుగూరి అనిల్, బొడిగ రాధ, కోశాధికారి క్యాష వెంకటేష్, సోషల్ మీడియా కన్వీనర్ దాసరి వీరన్న తదితరులు పాల్గొన్నారు.
పార్టీ కార్యవర్గ సభ్యులు, బూత్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## లక్ష్మణ్ నాయక్‌పై దాడిని ఖండించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వేలేరు, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్‌పై జరిగిన దాడిని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసాత్మక రాజకీయాలకు, భౌతిక దాడులకు తావు లేదని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దాడి విషయం తెలిసిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి పోలీసు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఘటనకు బాధ్యులైన నిందితులను మరియు వారి వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. దాడిలో గాయపడి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మణ్ నాయక్ ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం లక్ష్మణ్ నాయక్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. ఈ సందర్భంగా ధైర్యంగా ఉండాలని, పార్టీ పరంగా మరియు వ్యక్తిగతంగా పూర్తి అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దాడికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టి తగిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



## విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం..



- **బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్**

**వేలేరు, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామ పంచాయతీ పరిధిలోని వేములపల్లిలో బుధవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో గుడిసెలోని సామగ్రి అగ్నికి ఆహుతైనట్లు సమాచారం. ఘటన విషయం తెలుసుకున్న పీచర గ్రామ సర్పంచ్ మరిజే అనిత నరసింహారావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబానికి గ్రామపంచాయతీ తరఫున అండగా ఉంటామని, ప్రభుత్వ పరంగా అందే సహాయాన్ని అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వేములపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## లక్ష్యం చేరలేనననే మనోవేదనతో యువకుడి బలవన్మరణం

**చిల్పూర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పొడిశెట్టి సాయి (26) అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు.గ్రామస్తుల వివరాల ప్రకారం సాయి కొంతకాలంగా పోలీసు ఉద్యోగం సాధించేందుకు సిద్ధమవుతున్నాడు. తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నాననే మనోవేదనతో తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జనగామ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. మృతుడి వద్ద లభించిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన మరణానికి ఎవరూ కారణం కాదని అందులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు ప్రస్తుతం నాగపూర్‌లో ఉండగా, వారు వచ్చిన అనంతరం వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై సిరిపురం నవీన్ కుమార్ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలకు యువత కుంగిపోవద్దని సూచించారు. లక్ష్య సాధనలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమిస్తూ పట్టుదలతో ముందుకు సాగాలని, జీవితాన్ని ముగించుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని తెలిపారు. మనోవేదనకు గురైన వారు కుటుంబ సభ్యులు, స్నేహితులతో తమ సమస్యలను పంచుకోవాలని సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఘనంగా వినాయకుడి నిమజ్జనోత్సవం



**కాజీపేట్ సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** కాజీపేట్ లోని రైల్వేడీజిల్ లోకో షెడ్ లో ఏర్పాటుచేసిన వినాయకుడిని గురువారం కార్మికులు ఘనంగా నిమజ్జనం చేశారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని రైల్వే డిజిల్ లోకో షెడ్ కార్మికులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలను నిర్వహించి గురువారం సాయంత్రం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్ ,రాముల సదానందం ,నరేష్‌యాదవ్ ,యాదగిరి, తిరుపతి, శివప్రసాద్, రోహిత్, శ్రీధర్ లతోపాటు రైల్వే అధికారులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాజీపేట్ జంక్షన్ ముందు ఘనంగా మోడీ జన్మదిన వేడుకలు




**కాజీపేట్ సెప్టెంబర్17 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ ప్రధాని నరేంద్ర మోడీ 76వ జన్మదిన ఉత్సవాన్ని కాజీపేట్ జంక్షన్ ముందు గురువారం సాయంత్రం బిజెపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ నగర మేయర్ తక్కలపల్లి రాజేశ్వరరావు హాజరయ్యారు. కాంగ్రెస్ పాలించిన చీకటి కోణాన్ని తరిమికొట్టే విధంగా కమలం రూపంలో దీపాలను అలంకరించారు. ఈ కార్యక్రమంలో47 వ డివిజన్ అధ్యక్షుడు గంధసిరి శ్రీకాంత్ 62వ డివిజన్ అధ్యక్షుడు మేకల శ్రావణ్ యాదవ్ సీనియర్ నాయకులు రామలింగం, కొత్త రవి, చాంద్ పాషా, జరీనా, నర్సింగ్ గౌడ్, కయిత రాజ్ కుమార్ యాదవ్ ,భగవాన్ దాస్ ఉపాధ్యాయ, ఉడతల బాబురావు, అంకేశ్వరం కుమార్ స్వామి, చీకటి రమేష్, సిరిబాద్రి, విష్ణు, శ్రీను ,మోహన్ పాల్గొన్నారు.

# ఘనంగా విశ్వకర్మ యాగం



**కాజీపేట్ సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** కాజీపేట్ మండలం సోమిడి గ్రామంలో నున్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో విశ్వకర్మ జయంతి ని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ యాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు వేద పండితులు వేద మంత్రోచ్చరణ మధ్య హోమం పూర్ణాహుతి ని నిర్వహించారు అనంతరం విశ్వకర్మ భగవానునికి ప్రత్యేక పూజలు అలంకరణ అభిషేకాలు జరిపించారు ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి చుట్టుప్రక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు భక్తులకు గ్రామ పెద్దలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సర్పంచ్ నేతాజీ



- **నేరడ జెడ్ పి ఎస్ ఎస్ పాఠశాలలో ఆకస్మికంగా పర్యటించిన సర్పంచ్**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలం నేరడ గ్రామంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలను గ్రామ సర్పంచ్ నేతాజీ సందర్శించారు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన, భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతపై విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన సర్పంచ్ నేతాజీ "భోజనం ఎలా ఉంది? రుచిగా ఉందా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?" అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ స్కూల్ సందర్శించిన వారిలో ఉపసర్పంచ్ కోట బాలఏసు గ్రామ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు చెవుల తిరుపతి రావ్ ఉన్నారు

# తాటికాయలలో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



**ధర్మసాగర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని తాటికాయల గ్రామంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పెసరు వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి, ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పెసరు వెంకటేష్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో, విజయాలతో మరింత కాలం దేశానికి సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయనకు ఆశీస్సులు కలగాలని కోరుతూ ఆశీస్సుల దీపం వెలిగించారు.ఈ కార్యక్రమంలో నాయకులు చల్ల శివకృష్ణ, పెసరు తిరుపతి, పెసరు రాజు, బొల్లెపాక వెంకటస్వామి, దుబాల అనిల్, దుబాల అఖిల్, చొక్కం రాజు, ననుబాల కుమార్, ననుబాల సర్వేశ్వర్, పిట్టల హరీష్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తెలంగాణ..

- **రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ - 17(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు స్థానిక పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డిప్యూటి సీఎం మాట్లాడుతూ, సెప్టెంబర్ 17న భారతదేశంలో అంతర్భాగంగా మారి ప్రజాస్వామ్య పాలనలోకి అడుగుపెట్టిన తెలంగాణ 1,000 రోజుల ప్రజా పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేసిందన్నారు. ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం ఉద్యమించిన యోధుల వెలకట్టలేని త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వం పూర్తి చేసుకున్న పాలనలో పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యతనిచ్చామని డిప్యూటీ సీఎం తెలిపారు.

మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మహిళలు ఉచిత ఆర్టీసీ ప్రయాణాల ద్వారా రూ. 343.44 కోట్లు ఆదా చేసుకున్నారని వివరించారు.

రైతు భరోసా ద్వారా ఖమ్మం జిల్లాలోని 3,41,913 మంది రైతులకు రూ. 427.96 కోట్లు అందించామని, పంట రుణమాఫీ కింద 1,31,760 మంది రైతులకు రూ. 912.61 కోట్ల రుణభారం నుంచి విముక్తి కల్పించామని తెలిపారు.

గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే 2.49 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. 2030 నాటికి 20,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యంగా తెలంగాణను హరిత ఇంధన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

సీతారామ ఎత్తిపోతల పథకం, పాలేరు లింక్ కాలువ, మున్నేరుపాలేరు లింక్ కాలువ, జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఖమ్మం నగరాన్ని వరదల నుంచి రక్షించేందుకు రూ. 525.36 కోట్లతో వరద రక్షణ గోడ నిర్మిస్తున్నామన్నారు.

జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని బలోపేతం చేస్తూ ఆసుపత్రులలో అత్యాధునిక వైద్య వసతులను కల్పిస్తున్నామని తెలిపారు.

జిల్లాలో తొలి దశలో 16,597 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి రూ. 491.8 కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. అలాగే పేదలకు ప్రతి నెలా ఉచిత సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. టీఐపాస్, పీఎమ్ఈజీపీ ద్వారా రూ. 577 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించి యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రతి కుటుంబ సంక్షేమం, ప్రతి ప్రాంత సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

వేడుకల్లో భాగంగా పీఎంశ్రీ జెడ్పీహెచ్ ఎస్, పందిళ్లపల్లి విద్యార్థినులు ప్రదర్శించిన ప్రజా పాలన పాట, ఎంజేపీటీబిసి, డబ్ల్యూఆర్జేసి, లంకపల్లి, దానవాయిగూడెం విద్యార్థినులు ప్రదర్శించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ పాట, టీజీఎస్డబ్ల్యూఆర్ఎస్, జేసి టేకులపల్లి విద్యార్థులు ప్రదర్శించిన పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న గానమా పాటపై నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

తెలంగాణ అమరవీరులు జర్పుల సురేష్, మీనా వేణు, వెంపడి రామకృష్ణ, ఎస్కే. మహమూద్ పాషా, యన్మందుల వేణుగోపాల్ ల కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.

అనంతరం వ్యవసాయ, ఉద్యానవన, డిఆర్డిఎ, సంక్షేమం, వైద్య ఆరోగ్య, అటవీ, విద్యా, ఎస్సీ/ఎస్టీ/బిసి/మైనారిటీ సంక్షేమం, విద్యుత్, సైబర్ నేరాలు, టిజి ఆర్టీసీ, పౌరసరఫరాలు, మోడల్ స్కూల్స్ శాఖలచే ఏర్పాటుచేసిన స్టాళ్లను డిప్యూటీ సిఎం పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి రాంమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం




**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్ర గ్రంథాలయం, ఖమ్మంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ, ఖమ్మం చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక ముఖ్యమైన రోజని, ప్రజాస్వామ్య పాలనకు సంబంధించిన చారిత్రాత్మక పరిణామాలను స్మరించుకోవడంతో పాటు, ప్రజాస్వామ్య విలువలు, ప్రజల హక్కులు మరియు బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలిపారు.

మహ్మద్ ఖాదర్ బాబా మాట్లాడుతూ, ప్రజలకు విజ్ఞానం మరియు సమాచారాన్ని అందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్యార్థులు, యువతలో చరిత్ర, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం మరియు సామాజిక బాధ్యతలపై అవగాహన పెంపొందించేందుకు గ్రంథాలయాలు మరింత చురుకుగా పనిచేయాలని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల చారిత్రాత్మక పోరాటాలు, త్యాగాలు మరియు ప్రజాస్వామ్య ఆకాంక్షలను నేటి తరానికి చేరవేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుతూ సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, కార్యాలయ సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పాల్గొన్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వ పాలన

- **రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో రూ.50.86సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ, మల్లేపల్లి, మునిగేపల్లి లబ్ధిదారులకు పక్కా ఇళ్లు, ఇంటి స్థలాల పంపిణీ**



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల కాలంలో పేద ప్రజల సంక్షేమమే ప్రధాన అజెండాగా పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం 173 మంది లబ్ధిదారులకు రూ.50.86 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మల్లేపల్లి గ్రామానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్లు, మునిగేపల్లి గ్రామానికి చెందిన 12 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదవాడి భద్రత, భరోసాయే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నప్పటికీ, ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటున్నామని స్పష్టం చేశారు.

**సీఎంఆర్ఎఫ్ కు రూ. 3,250 కోట్లతో అండగా నిలిచిన ప్రభుత్వం**

రాష్ట్ర విభజన తర్వాత ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా ఇప్పటివరకు సుమారు రూ. 3,250 కోట్ల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర వ్యాప్తంగా పేదల వైద్య సహాయం కోసం అందించామని మంత్రి అన్నారు. వైద్యాన్నే కాకుండా పేద పిల్లలకు ప్రైవేట్ రంగానికి దీటుగా ప్రభుత్వ రంగంలో మెరుగైన విద్యను అందిస్తున్నామని తెలిపారు.

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లిస్తాం**

రాష్ట్రంలో మొదటి విడత కింద 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, పాలేరు నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో సగం నిర్మించి వదిలేసిన ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం రూ. 1,100 కోట్లు వెచ్చించిందని, ప్రజాధనం వృథా కాకుండా పేదలకు ఇళ్లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు గతంలో పాలకుల హయాంలో పేదల కోసం సేకరించి, ఆ తర్వాత ఆక్రమణలకు గురైన నివాస స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఆక్రమణల నుంచి విడిపించిన స్థలాలను అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.పేద నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడంలో ఈ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరేలా నిరంతరం శ్రమిస్తామని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# సెమికాన్ ఇండియా 2026కు మోదీ శ్రీకారం

- **న్యూఢిల్లీలో సెమికాన్ ఇండియా 2026 ప్రారంభం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు)** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం న్యూఢిల్లీలో సెమికాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, సాంకేతిక నిపుణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రస్తావిస్తూ, దేశాన్ని ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. సాంకేతిక రంగ భవిష్యత్తును నిర్దేశించే వేదికగా సెమికాన్ ఇండియా నిలుస్తోందన్నారు. సెమికాన్ ఇండియా కార్యక్రమం 2022లో ప్రారంభమైనప్పటి నుంచి సాధించిన పురోగతిని మోదీ వివరించారు. ప్రారంభ దశలో విధానాల రూపకల్పనతో మొదలైన ప్రయాణం, అనంతరం ప్రాజెక్టుల ప్రణాళిక, ప్రయోగాత్మక ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు, ప్రస్తుతం వాణిజ్య ఉత్పత్తి దశకు చేరుకుందని చెప్పారు. దేశంలో సెమీకండక్టర్ తయారీకి అవసరమైన పునాదులు వేగంగా బలపడుతున్నాయని పేర్కొన్నారు. ఇది భారత సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. సెమీకండక్టర్ వ్యవస్థ నిర్మాణం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. చిప్ రూపకల్పన, తయారీ పరికరాల అభివృద్ధి, పరీక్షా సామర్థ్యాల నిర్మాణం వంటి అంశాల్లో అనేక



రంగాల సమన్వయం అవసరమని చెప్పారు. తక్కువ సమయంలో ఈ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు చేసిన కృషిని అభినందించారు. ఈ సహకారంతో భారత్ వేగంగా ముందుకు సాగుతోందన్నారు. దేశీయ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మోదీ నొక్కి చెప్పారు. స్వతంత్రంగా చిప్ రూపకల్పన చేసే సంస్థలను ప్రోత్సహించడంతో పాటు మేధోసంపత్తి హక్కుల సృష్టికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా ప్రపంచ మార్కెట్‌లో భారత స్థానం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. సాంకేతిక స్వావలంబన సాధనలో ఇది కీలక అంశమన్నారు. కృత్రిమ మేధ ఆధారిత మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన సిలికాన్ ఫోటోనిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను సమగ్రంగా అనుసంధానం చేయాలని ప్రధానమంత్రి సూచించారు. భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మౌలిక వసతుల నిర్మాణంలో సెమీకండక్టర్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సాంకేతిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారత్ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# వెదురుతో హరిత భవిష్యత్ సాధ్యం



- **పర్యావరణ పరిరక్షణలో వెదురు కీలకం**
- **గ్రామీణ ఆర్థికాభివృద్ధికి వెదురు ఆధారం**

**డెస్క్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు)** ప్రకృతి ప్రసాదించిన అత్యంత ఉపయోగకరమైన వనరుల్లో వెదురు ఒకటి. వేగంగా పెరిగే సామర్థ్యం, బహుళ ప్రయోజనాలు, పర్యావరణ అనుకూల లక్షణాల కారణంగా వెదురును ప్రపంచవ్యాప్తంగా "హరిత బంగారం"గా అభివర్ణిస్తున్నారు. వెదురు ప్రాధాన్యం, దాని ఆర్థిక మరియు పర్యావరణ ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న ప్రపంచ వెదురు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవం ద్వారా వెదురు సాగు, వినియోగం, సంరక్షణకు ప్రోత్సాహం కల్పించడం ప్రధాన ఉద్దేశంగా ఉంది.

వెదురు ప్రపంచంలో అత్యంత వేగంగా పెరిగే మొక్కలలో ఒకటి. కొన్ని రకాల వెదురు రోజుకు ఒక మీటరు వరకు పెరిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఇతర వృక్షాలతో పోలిస్తే తక్కువ కాలంలో కోతకు సిద్ధమవుతుంది. అందువల్ల కలపకు ప్రత్యామ్నాయంగా వెదురు వినియోగం పెరుగుతోంది. వేగంగా పునరుత్పత్తి చెందే ఈ మొక్క సహజ వనరుల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది. పర్యావరణ పరిరక్షణలో వెదురు ప్రాముఖ్యత ఎంతో గొప్పది. వెదురు మొక్కలు వాతావరణంలో ఉన్న కార్బన్ డయాక్సైడ్‌ను అధికంగా గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. దీంతో వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. నేల కోతను అరికట్టడంలో, భూసారాన్ని కాపాడడంలో కూడా వెదురు కీలక పాత్ర పోషిస్తుంది. నదీ తీరాలు, కొండ ప్రాంతాలు, భూక్షీణతకు గురైన ప్రాంతాల్లో వెదురు సాగు పర్యావరణ సమతుల్యతను మెరుగుపరుస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది కుటుంబాలకు వెదురు జీవనాధారంగా నిలుస్తోంది. వెదురుతో బుట్టలు, గృహోపకరణాలు, వ్యవసాయ పరికరాలు, అలంకరణ వస్తువులు, ఫర్నిచర్ వంటి అనేక ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వెదురు ఆధారిత పరిశ్రమలు గ్రామీణ ఉపాధికి దోహదపడటంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తున్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధిలో కూడా వెదురు కీలక వనరుగా మారుతోంది.

ఆధునిక కాలంలో వెదురు వినియోగం మరింత విస్తరించింది. నిర్మాణ రంగంలో వెదురుతో ఇళ్లు, వంతెనలు, పర్యాటక కాటేజీలు నిర్మిస్తున్నారు. వెదురు బలంగా ఉండటంతో పాటు తక్కువ బరువు కలిగి ఉండటం దీని ప్రత్యేకత. పర్యావరణ హిత నిర్మాణాలకు ప్రపంచవ్యాప్తంగా వెదురు వినియోగం పెరుగుతోంది. అనేక దేశాలు వెదురును స్థిరమైన అభివృద్ధికి అవసరమైన వనరుగా గుర్తించాయి. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడంలో కూడా వెదురు కీలక పాత్ర పోషిస్తోంది. వెదురుతో తయారయ్యే చెంచాలు, ప్లేట్లు, నీటి సీసాలు, దువ్వెనలు, టూత్ బ్రష్‌లు వంటి ఉత్పత్తులు పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలుగా మారుతున్నాయి. ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా వెదురు ఉత్పత్తులను ఉపయోగించడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది.

భారతదేశంలో కూడా వెదురు సాగుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు అనేక ప్రాంతాల్లో విస్తారంగా వెదురు పెరుగుతోంది. రైతులకు అదనపు ఆదాయం కల్పించేందుకు వెదురు సాగును ప్రోత్సహించే కార్యక్రమాలు అమలులో ఉన్నాయి. వెదురు ఆధారిత పరిశ్రమలకు మద్దతు అందించడం ద్వారా గ్రామీణాభివృద్ధికి ఊతమివ్వాలని ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. వాతావరణ మార్పులు, అటవీ నిర్మూలనం, జీవవైవిధ్య నష్టం వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు వెదురు ఒక సమర్థవంతమైన పరిష్కారంగా భావిస్తున్నారు. తక్కువ నీటితో పెరిగే సామర్థ్యం, అధిక ఉత్పాదకత, కార్బన్ నిల్వ చేసే శక్తి కారణంగా వెదురు భవిష్యత్ పర్యావరణ వ్యూహాల్లో ముఖ్యమైన స్థానం సంపాదించింది. ప్రపంచవ్యాప్తంగా వెదురు సాగును విస్తరించేందుకు అనేక సంస్థలు కృషి చేస్తున్నాయి.

ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థలు, పర్యావరణ సంస్థలు, రైతు సంఘాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. వెదురు సాగు ప్రయోజనాలు, పర్యావరణ విలువ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తాయి. యువతలో ప్రకృతి పరిరక్షణ పట్ల బాధ్యత పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకంగా మారుతున్నాయి. ప్రపంచ వెదురు దినోత్సవం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తోంది. ప్రకృతిని కాపాడుతూ ఆర్థికాభివృద్ధిని సాధించాలంటే వెదురు వంటి స్థిరమైన వనరులను ప్రోత్సహించాలి. పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పన, గ్రామీణాభివృద్ధి, కాలుష్య నియంత్రణ వంటి అనేక రంగాల్లో వెదురు విశేష పాత్ర పోషించగలదు. హరిత భవిష్యత్ నిర్మాణంలో వెదురు ఒక ముఖ్యమైన మిత్రుడిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అందరికీ సమాన వేతనం అందాలి

- **సమాన పనికి సమాన వేతనం మానవ హక్కు**
- **వేతన వ్యత్యాసాల నిర్మూలనకు ప్రపంచ పిలుపు**
- **ఆర్థిక సమానత్వానికి సమాన వేతనం కీలకం**





**డెస్క్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు)** ప్రపంచవ్యాప్తంగా సమానత్వం, న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ కోసం అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. వాటిలో అంతర్జాతీయ సమాన వేతన దినోత్సవం ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంది. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న నిర్వహించే ఈ దినోత్సవం ద్వారా సమాన విలువ కలిగిన పనికి సమాన వేతనం అందించాలనే సందేశాన్ని ప్రపంచ దేశాలకు అందిస్తున్నారు. ఉద్యోగం చేసే వ్యక్తి లింగం, సామాజిక నేపథ్యం, వర్గం లేదా ఇతర అంశాల ఆధారంగా కాకుండా అతను లేదా ఆమె చేసే పని విలువ ఆధారంగానే వేతనం నిర్ణయించాలనే భావనకు ఈ దినోత్సవం ప్రతీకగా నిలుస్తోంది. సమాన పనికి సమాన వేతనం అనేది కేవలం ఆర్థిక అంశం మాత్రమే కాదు. ఇది సామాజిక న్యాయం, మానవ గౌరవం, సమాన అవకాశాలకు సంబంధించిన అంశం కూడా. ఒకే విధమైన అర్హతలు, అనుభవం, బాధ్యతలతో పని చేసే ఇద్దరు వ్యక్తులకు కేవలం లింగభేదం కారణంగా వేతనాల్లో తేడాలు ఉండటం అన్యాయంగా పరిగణించబడుతోంది. ఈ అసమానతలను తొలగించాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వాలు, కార్మిక సంఘాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. ప్రపంచంలోని అనేక దేశాల్లో మహిళలు విద్య, ఉద్యోగాలు, వ్యాపార రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ వేతన అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు. ఉన్నత పదవుల్లో పనిచేసే మహిళల సంఖ్య పెరుగుతున్నా, సగటు ఆదాయంలో ఇంకా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. కొన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ వారి ఆదాయం తక్కువగా ఉండటం అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. వేతన వ్యత్యాసాలకు అనేక కారణాలు ఉన్నాయి. ఉద్యోగ అవకాశాల్లో వివక్ష, ప్రమోషన్లలో అసమానతలు, ఉన్నత స్థాయి పదవుల్లో తక్కువ ప్రాతినిధ్యం, కుటుంబ బాధ్యతల భారం వంటి అంశాలు ప్రధాన కారణాలుగా గుర్తించబడ్డాయి. ముఖ్యంగా మహిళలు కుటుంబ సంరక్షణ, పిల్లల పెంపకం, వృద్ధుల సంరక్షణ వంటి బాధ్యతలను ఎక్కువగా నిర్వహించడం వల్ల వారి వృత్తి జీవితంపై ప్రభావం పడుతోంది. దీని కారణంగా వారి ఆదాయ వృద్ధి కూడా మందగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సమాన వేతనం అమలైతే మహిళల ఆర్థిక స్వావలంబన మరింత బలపడుతుంది. కుటుంబ నిర్ణయాల్లో వారి భాగస్వామ్యం పెరుగుతుంది. విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాల మెరుగుదలకు ఇది దోహదపడుతుంది. మహిళల ఆదాయం పెరిగినప్పుడు దాని ప్రభావం కుటుంబాల అభివృద్ధిపైనే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థపైనా సానుకూలంగా కనిపిస్తుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఆర్థికాభివృద్ధి సాధించాలంటే సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించాలి. సమాన వేతనం ఆ దిశగా ఒక కీలక అడుగు. ఉద్యోగ ప్రదేశాల్లో పారదర్శక వేతన విధానాలు అమలు చేయడం, అర్హతలు మరియు పనితీరు ఆధారంగా వేతనాలు నిర్ణయించడం, వివక్షకు తావులేకుండా చర్యలు తీసుకోవడం ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకోవచ్చు. ప్రభుత్వాలు, సంస్థలు, కార్మిక సంఘాలు కలిసి పనిచేసినప్పుడే దీర్ఘకాలిక ఫలితాలు సాధ్యమవుతాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వేతన సమానత్వానికి సంబంధించిన చట్టాలను అమలు చేస్తున్నాయి. ఉద్యోగ రంగంలో లింగ వివక్షను నిరోధించే విధానాలను ప్రవేశపెడుతున్నాయి. వేతన వివరాల్లో పారదర్శకత పెంచడం, ఉద్యోగుల హక్కులను రక్షించడం, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపడుతున్నాయి. ఇవి సమాన వేతనం సాధనలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అంతర్జాతీయ సమాన వేతన దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, కార్మిక సంఘాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. చర్చా వేదికలు, అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచేందుకు కృషి చేస్తాయి. సమానత్వం అనేది కేవలం చట్టాల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలని ఈ కార్యక్రమాలు గుర్తుచేస్తాయి. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో ఉద్యోగ రంగం వేగంగా మారుతోంది. కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఈ మార్పుల్లో మహిళలు, పురుషులు సమానంగా భాగస్వాములు కావాలంటే వేతన సమానత్వం అత్యంత అవసరం. ఉద్యోగాల్లో ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వడం, వివక్షను పూర్తిగా తొలగించడం ద్వారా మాత్రమే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. అంతర్జాతీయ సమాన వేతన దినోత్సవం ప్రపంచ సమాజానికి ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తోంది. సమాన విలువ కలిగిన పనికి సమాన వేతనం చెల్లించడం ప్రతి సంస్థ, ప్రతి ప్రభుత్వం, ప్రతి సమాజం బాధ్యత. వేతన సమానత్వం సాధించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు నెరవేరుతాయి. సమాన అవకాశాలు, సమాన గౌరవం, సమాన ఆదాయం కలిగిన సమాజ నిర్మాణమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం.

# నీటి సంరక్షణకు జల పర్యవేక్షణ అవసరం

- **నీటి నాణ్యత పరిరక్షణపై అవగాహన పెంపు**
- **భవిష్యత్ తరాలకు స్వచ్ఛ జలాల లక్ష్యం**



**డెస్క్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు)** నీరు జీవజాలానికి ప్రాణాధారం. మానవ మనుగడ నుంచి వ్యవసాయం, పరిశ్రమలు, పర్యావరణ సమతుల్యత వరకు ప్రతి రంగం నీటిపైనే ఆధారపడి ఉంది. అయితే జనాభా పెరుగుదల, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, కాలుష్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా నీటి వనరులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో నీటి నాణ్యతను కాపాడుకోవడం, జల వనరుల స్థితిగతులను నిరంతరం పరిశీలించడం ఎంత ముఖ్యమో తెలియజేసేందుకు ప్రతి సంవత్సరం ప్రపంచ జల పర్యవేక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవం ప్రజల్లో నీటి పరిరక్షణపై అవగాహన పెంచడంతో పాటు జల వనరుల సంరక్షణలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ జల పర్యవేక్షణ దినోత్సవం ప్రారంభం వెనుక ప్రధాన ఉద్దేశం సాధారణ ప్రజలను కూడా నీటి నాణ్యత పరిశీలన కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం. నదులు, చెరువులు, సరస్సులు, భూగర్భ జలాల పరిస్థితిని తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు మాత్రమే కాకుండా విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు కూడా ముందుకు రావాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. నీటి ఉష్ణోగ్రత, ఆమ్లత స్థాయి, కరిగిన ఆక్సిజన్ పరిమాణం వంటి అంశాలను పరిశీలించడం ద్వారా జల వనరుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయవచ్చు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో నీటి కాలుష్యం ఆందోళనకర స్థాయికి చేరుకుంది. పరిశ్రమల వ్యర్థాలు, గృహ మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయన ఎరువులు, పురుగుమందులు నీటి వనరుల్లో కలవడం వల్ల నదులు, చెరువులు కలుషితమవుతున్నాయి. దీని ప్రభావం కేవలం మానవులపైనే కాకుండా జలచరాలు, పక్షులు, ఇతర జీవరాశులపై కూడా పడుతోంది. కాలుష్యానికి గురైన నీరు అనేక రకాల వ్యాధులకు కారణమవుతోంది. అందువల్ల నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడం అత్యవసరంగా మారింది. భారతదేశం వంటి వ్యవసాయాధారిత దేశాల్లో నీటి ప్రాధాన్యం మరింత ఎక్కువ. పంటల సాగు, తాగునీటి అవసరాలు, విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక అవసరాలన్నీ జల వనరులపైనే ఆధారపడి ఉన్నాయి. వర్షపాతం అస్థిరంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును విలువైన వనరుగా భావించాల్సిన అవసరం ఉంది. నీటి నిల్వలు తగ్గిపోతున్న నేపథ్యంలో వాటి నాణ్యతను కాపాడటం కూడా సమానంగా ముఖ్యమైన అంశంగా మారింది. భూగర్భ జలాల పరిస్థితి కూడా అనేక ప్రాంతాల్లో ఆందోళనకరంగా ఉంది. అధిక వినియోగం కారణంగా భూగర్భ జల మట్టాలు క్రమంగా తగ్గుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఫ్లోరైడ్, ఆర్సెనిక్, ఇతర రసాయనాల మోతాదు పెరగడం వల్ల తాగునీటి నాణ్యత దెబ్బతింటోంది. ఈ సమస్యలను ముందుగానే గుర్తించడానికి జల పర్యవేక్షణ వ్యవస్థలు ఎంతో ఉపయోగపడతాయి. నిరంతర పరిశీలన ద్వారా ప్రమాదాలను అంచనా వేసి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో నీటి కాలుష్యం మరింత వేగంగా పెరుగుతోంది. నగరాల విస్తరణతో పాటు మురుగునీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల చెరువులు, వాగులు, నదులు కలుషితమవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలు కూడా జల వనరులకు ముప్పుగా మారుతున్నాయి. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లోని నీటి వనరుల సంరక్షణకు బాధ్యత వహించినప్పుడే ఈ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

జల పర్యవేక్షణలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోంది. ఆధునిక పరికరాలు, సెన్సార్లు, ఉపగ్రహ చిత్రాల సహాయంతో నీటి నాణ్యతను వేగంగా అంచనా వేయగలుగుతున్నారు. కాలుష్య స్థాయిలను గుర్తించడం, నీటి వినియోగాన్ని విశ్లేషించడం, ప్రమాదకర మార్పులను ముందుగానే గుర్తించడం వంటి పనులు ఇప్పుడు మరింత సులభమయ్యాయి. ఈ సాంకేతికతలను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా జల వనరుల పరిరక్షణకు బలమైన పునాది వేయవచ్చు. పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు ఈ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. విద్యార్థుల్లో నీటి సంరక్షణ పట్ల బాధ్యతాభావం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు. చిన్న వయసు నుంచే నీటి విలువను అర్థం చేసుకున్న తరాలు భవిష్యత్తులో జల వనరుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి.

వాతావరణ మార్పులు కూడా జల వనరులపై ప్రభావం చూపుతున్నాయి. అనిశ్చిత వర్షపాతం, వరదలు, కరువు పరిస్థితులు నీటి లభ్యతను ప్రభావితం చేస్తున్నాయి. ఈ మార్పులను అర్థం చేసుకుని తగిన ప్రణాళికలు రూపొందించాలంటే జల పర్యవేక్షణ అత్యంత అవసరం. నీటి వనరుల స్థితిగతులపై ఖచ్చితమైన సమాచారం ఉంటేనే భవిష్యత్ అవసరాలను సమర్థవంతంగా నిర్వహించగలుగుతాం. ప్రపంచ జల పర్యవేక్షణ దినోత్సవం మనందరికీ ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. నీటిని కేవలం వినియోగించే వనరుగా కాకుండా భవిష్యత్ తరాలకు అందించాల్సిన అమూల్య సంపదగా చూడాలి. ప్రతి వ్యక్తి నీటి సంరక్షణలో భాగస్వామి కావాలి. జల వనరుల నాణ్యతను కాపాడుతూ, కాలుష్యాన్ని అరికడుతూ, బాధ్యతాయుత వినియోగాన్ని అలవర్చుకున్నప్పుడే నీటి భద్రత సాధ్యమవుతుంది. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, సురక్షితమైన నీటిని అందించడం మనందరి ఉమ్మడి బాధ్యత.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మరోసారి టాటా సన్స్ చైర్మన్‌గా చంద్రశేఖరన్




**ముంబై, సెప్టెంబరు 17 (తెలంగాణ ముచ్చట్లు):** టాటా గ్రూప్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ మరోసారి నియమితులయ్యారు. టాటా సన్స్ బోర్డు ఆయనను మూడోసారి చైర్మన్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. గురువారం ముంబైలో జరిగిన బోర్డు సమావేశంలో ఈ నియామకంపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొత్త పదవీకాలంలో ఆయన మరో ఐదేళ్లపాటు బాధ్యతల్లో కొనసాగనున్నారు.

చంద్రశేఖరన్ 2017లో తొలిసారి టాటా సన్స్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2022లో రెండోసారి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుత పదవీకాలం 2027 ఫిబ్రవరితో ముగియాల్సి ఉంది. గత ఆగస్టు 12న పదవీకాలం ముగిసిన తర్వాత బాధ్యతల్లో కొనసాగబోనని ఆయన ప్రకటించినట్లు సమాచారం. అయితే తాజాగా బోర్డు మరోసారి ఆయనకే బాధ్యతలు అప్పగించింది. టాటా గ్రూప్ సంస్థ టాటా సన్స్ స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అంశానికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ నుంచి మినహాయింపు కోరగా.. ఆ దరఖాస్తు తిరస్కరణకు గురైనట్లు సమాచారం. దీంతో లిస్టింగ్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో నాయకత్వంలో మార్పు చేయడం కంటే చంద్రశేఖరన్‌నే కొనసాగించడం ద్వారా ప్రక్రియ సజావుగా సాగుతుందని బోర్డు భావించినట్లు తెలుస్తోంది.

చంద్రశేఖరన్ నాయకత్వంలో టాటా గ్రూప్ పలు వ్యాపార రంగాల్లో విస్తరించింది. ముఖ్యంగా సాంకేతిక, డిజిటల్ రంగాల్లో సంస్థ కార్యకలాపాలు పెరిగాయి. తాజా నియామకానికి సంబంధించిన తదుపరి ప్రక్రియలో నామినేషన్, రెమ్యునరేషన్ కమిటీ ఆయనను కొనసాగాలని కోరనుంది. చంద్రశేఖరన్ అంగీకారం అనంతరం కొత్త పదవీ కాలం అమల్లోకి రానున్నట్లు సమాచారం.

# అనధికార నిర్మాణంపై మున్సిపల్ చర్య

- ధరణి కాలనీలో పెంట్‌హౌస్ నిర్మాణం తొలగింపు
- అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణంపై చర్య
- నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచన
- క్రమబద్ధమైన నగరాభివృద్ధే లక్ష్యమని వెల్లడి



**మేడిపల్లి, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు)** మేడిపల్లి గ్రామ పరిధిలోని ధరణి కాలనీలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణంపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన పెంట్‌హౌస్ సెంట్రింగ్ నిర్మాణాన్ని గుర్తించిన అధికారులు గురువారం తొలగింపు చర్యలు నిర్వహించారు. పట్టణ ప్రణాళిక నిబంధనలను ఉల్లంఘించి చేపట్టే నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. నగరాభివృద్ధిలో చట్టబద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అధికారుల తనిఖీల్లో భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు లేకుండానే పెంట్‌హౌస్ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు గుర్తించినట్లు సమాచారం. దీనిపై సంబంధిత యజమానికి నోటీసులు జారీ చేసిన అనంతరం మున్సిపల్ సిబ్బంది తొలగింపు చర్యలు చేపట్టారు. నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో అనుమతి లేకుండా చేపట్టే నిర్మాణాలు భవిష్యత్తులో పలు సమస్యలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

భవన నిర్మాణాలు చేపట్టే ముందు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలని మున్సిపల్ అధికారులు సూచించారు. నిర్దేశిత ప్రణాళికలు, భద్రతా ప్రమాణాలు, నిర్మాణ నియమావళిని అనుసరించి మాత్రమే పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ నిర్మాణ కార్యకలాపాలు నిర్వహిస్తే వివాదాలు, నష్టాలను నివారించవచ్చని తెలిపారు. నగర ప్రణాళికకు అనుగుణంగా నిర్మాణాలు ఉండటం అవసరమని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి వేగంగా జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అనధికార నిర్మాణాల నియంత్రణ అత్యంత అవసరమని అధికారులు అభిప్రాయపడ్డారు. అనుమతి లేకుండా నిర్మించే భవనాలు రహదారులు, పార్కులు, ప్రజా వసతులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నిర్మాణం చట్టబద్ధంగా ఉండేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు.

నగర అభివృద్ధి క్రమబద్ధంగా సాగాలంటే పౌరులు, అధికారులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని మున్సిపల్ వర్గాలు పేర్కొన్నాయి. నిర్మాణ రంగంలో పారదర్శకత, నియంత్రణ, బాధ్యతాయుత ధోరణి ఉంటే నగరాలు మరింత ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రజా భద్రత, మౌలిక వసతుల పరిరక్షణ కోసం నిబంధనల అమలు అత్యంత కీలకమని వివరించారు. అనుమతులతో నిర్మాణాలు చేపట్టడం, నిబంధనలను పాటించడం ద్వారా మాత్రమే సుస్థిర పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అనధికార నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు కొనసాగిస్తామని వెల్లడించారు. ప్రజలు నిర్మాణ అనుమతులు పొందిన తర్వాతే పనులు ప్రారంభించాలని సూచించారు. క్రమబద్ధమైన నగరాభివృద్ధే లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం పనిచేస్తోందని స్పష్టం చేశారు.

# అడిడాస్‌లో ఉద్యోగాల కోత.. 350 మందిపై ప్రభావం




**హైదరాబాద్, సెప్టెంబరు 17 (తెలంగాణ ముచ్చట్లు):** జర్మనీకి చెందిన ప్రముఖ క్రీడా దుస్తుల సంస్థ అడిడాస్ భారత్‌లోని తన సాంకేతిక విభాగంలో ఉద్యోగాల కోత చేపట్టింది. గురుగ్రామ్‌లోని టెక్నాలజీ కేంద్రంపై ఈ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెప్టెంబరు 16న అడిడాస్ ధ్రువీకరించింది.

ఈ ఉద్యోగాల కోతతో గురుగ్రామ్ టెక్ హబ్‌లో పనిచేస్తున్న 350 మందికి పైగా ఉద్యోగులపై ప్రభావం పడినట్లు అనధికారిక అంచనాలు ఉన్నాయి. ఇది ఆ కేంద్రంలోని మొత్తం సిబ్బందిలో దాదాపు 45 నుంచి 50 శాతానికి సమానమని తెలుస్తోంది. ప్రభావిత ఉద్యోగుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డేటా సైంటిస్టులు, డేటా ఇంజినీర్లు ఉన్నట్లు సమాచారం. అయితే మొత్తం భారత టెక్నాలజీ విభాగంలో ప్రభావితమయ్యే ఉద్యోగుల సంఖ్య 20 శాతం కంటే తక్కువేనని కంపెనీ తెలిపింది. సెప్టెంబరు 15న నిర్వహించిన ఉద్యోగుల సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించినట్లు సమాచారం. ప్రభావిత ఉద్యోగులను రెండు వర్గాలుగా విభజించినట్లు తెలుస్తోంది. ఒక వర్గానికి అదే రోజు ఉద్యోగ విరమణకు సంబంధించిన సమాచారం అందించగా.. మరో వర్గానికి డిసెంబరు 15 వరకు గడువు ఇచ్చినట్లు సమాచారం. ఈ వ్యవధిలో సంస్థలోని ఇతర విభాగాల్లో అవకాశాలను వెతుక్కోవాలని, లేకపోతే డిసెంబరు 15 చివరి పనిదినంగా ఉంటుందని వారికి తెలిపినట్లు తెలుస్తోంది.

వ్యాపార అవసరాలకు అనుగుణంగా సంస్థను మరింత బలోపేతం చేసేందుకు పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నామని అడిడాస్ పేర్కొంది. ఈ ప్రక్రియలో ప్రభావితమయ్యే ఉద్యోగులకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని తెలిపింది. అయితే ఉద్యోగులకు అందించే పరిహారం, ఇతర ప్రయోజనాలకు సంబంధించిన వివరాలను కంపెనీ అధికారికంగా వెల్లడించలేదు.

# రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన ఎంవీ.పాలెం మాజీ సర్పంచ్ తుమ్మల సురేష్



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం రూరల్ మండలంలోని ఎంవీ.పాలెం మాజీ సర్పంచ్, సిపిఎం నాయకులు తుమ్మల సురేష్ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై.. కాంగ్రెస్ గూటికి చేరారు. గురువారం కూసుమంచి లోని క్యాంప్ కార్యాలయంలో.. తుమ్మల సురేష్ కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి.. మంత్రి పొంగులేటి ఆహ్వానించారు. ప్రధానంగా తన గ్రామ అభివృద్ధిని కాంక్షిస్తూ.. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన, మంత్రి పొంగులేటి సారథ్యం నచ్చి కాంగ్రెస్ లో చేరినట్లు ఈ సందర్భంగా తుమ్మల సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, కాంగ్రెస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం, మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, సర్పంచ్ లు పాపా నాయక్, అంబేద్కర్ మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ పన్ను తగ్గింపు

**హైదరాబాద్, సెప్టెంబరు 17 (తెలంగాణ ముచ్చట్లు):** పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ పన్నును కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ఎగుమతులపై విధించే ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని (ఎస్ఏఈడీ) సవరించింది. కొత్త పన్ను రేట్లు సెప్టెంబరు 16 నుంచే అమల్లోకి వచ్చాయి. తాజా నిర్ణయం ప్రకారం ఎగుమతి చేసే డీజిల్‌పై విండ్‌ఫాల్ పన్నును లీటరుకు రూ.25 నుంచి రూ.20కి తగ్గించారు. ఏటీఎఫ్‌పై పన్నును రూ.19 నుంచి రూ.15కి, పెట్రోల్‌పై పన్నును రూ.1.50 నుంచి 50 పైసలకు తగ్గించారు. దీంతో డీజిల్‌పై లీటరుకు రూ.5, ఏటీఎఫ్‌పై రూ.4 మేర పన్ను తగ్గింది. అయితే ఈ పన్ను తగ్గింపు కేవలం ఎగుమతులకు మాత్రమే వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశీయ మార్కెట్లో విక్రయించే పెట్రోల్, డీజిల్ ధరలపై దీని ప్రభావం ఉండదని పేర్కొంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో పెట్రోల్ లీటరు ధర రూ.115.73, డీజిల్ ధర రూ.103.82గా కొనసాగుతున్నాయి. తాజా నిర్ణయంతో దేశీయ వినియోగదారులకు నేరుగా ఎలాంటి ధరల ఉపశమనం లభించదు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల పరిస్థితిని బట్టి కేంద్ర ప్రభుత్వం విండ్‌ఫాల్ పన్నును సాధారణంగా ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తుంది. తాజా తగ్గింపుతో పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేసే చమురు సంస్థలకు కొంత ప్రయోజనం కలగనుంది. రిలయన్స్, ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా వంటి సంస్థలపై పన్ను భారం తగ్గే అవకాశం ఉంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగిన సమయంలో చమురు కంపెనీలకు వచ్చిన అదనపు లాభాలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం 2022 జూలైలో తొలిసారిగా విండ్‌ఫాల్ పన్నును ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ఈ పన్ను రేట్లలో మార్పులు చేస్తూ వస్తోంది.

# ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**ధర్మసాగర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ అనుముల శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో కలిసి జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ప్రజల స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులను సంప్రదించాలని, చట్టాన్ని గౌరవిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం పోలీస్‌స్టేషన్ సిబ్బంది ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన సంక్షేమానికి కేసీఆర్ సేవలు చిరస్మరణీయం

- ఖానాపూర్‌లో ఘనంగా కృతజ్ఞత సభ

**ఖానాపూర్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు)** గిరిజన, ఆదివాసీల అభ్యున్నతికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన సేవలను స్మరించుకుంటూ ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో గిరిజన ఆదివాసీలు ఘనంగా కృతజ్ఞత సభ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ఆయనకు తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడం గిరిజన సమాజానికి చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల విద్య, ఉద్యోగ అవకాశాల్లో గిరిజన యువతకు మరింత ప్రాతినిధ్యం లభించిందని అన్నారు. గిరిజనుల సామాజిక, ఆర్థిక పురోగతికి ఈ చర్య దోహదపడిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం గిరిజన సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని సభలో పాల్గొన్నవారు పేర్కొన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, విద్యా అవకాశాల విస్తరణ వంటి కార్యక్రమాలు గిరిజనుల జీవితాల్లో మార్పులు తీసుకువచ్చాయని గుర్తుచేశారు. గిరిజనుల భూమి హక్కుల పరిరక్షణ, పోడు భూముల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలులో కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపారని నాయకులు తెలిపారు. గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అనేక చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. గిరిజన సమాజం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని అన్నారు. కృతజ్ఞత సభలో పాల్గొన్న గిరిజన ఆదివాసీలు కేసీఆర్‌కు తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు. గిరిజనుల అభ్యున్నతి కోసం తీసుకున్న నిర్ణయాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం కృషి కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి నినాదాలతో సభా ప్రాంగణాన్ని మార్మోగించారు. గిరిజనుల అభివృద్ధికి చేసిన సేవలను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని ముగించారు.



# పోలీసు ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ కోసం స్క్రీనింగ్ పరీక్ష

**వరంగల్, సెప్టెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలకు చెందిన పోలీసు ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు సీఐ ఏ. శ్రీనివాస్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ల సహకారంతో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక కోసం సెప్టెంబర్ 20న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు సీఐ ఏ. శ్రీనివాస్ తెలిపారు. పరీక్షలో పాల్గొనదలచిన అభ్యర్థులు ముందుగా తమ వివరాలను గూగుల్ ఫారమ్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

**నమోదు చేసుకునే లింక్: https://forms.gle/eD2E5jNfiebo5prG8**

**పరీక్ష నిర్వహించే కేంద్రాలు:**

**1. వరంగల్ – సీకేఎం కళాశాల, దేశాయిపేట**

**2. హనుమకొండ – ఎస్‌వీఎస్ కళాశాల, రామారం**

**3. జనగామ – సీజేఐటీ ఇంజినీరింగ్ కళాశాల, యశ్వంతపూర్ క్రాస్ రోడ్**

**4. పరకాల – ప్రభుత్వ జూనియర్ కళాశాల**

**5. నర్సంపేట – బిట్స్ కళాశాల, లక్నేపల్లి**

పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ ఏ. శ్రీనివాస్ కోరారు. స్క్రీనింగ్ పరీక్షలో పాల్గొనే అభ్యర్థులు ముందుగా నమోదు చేసుకుని, నిర్ణీత సమయానికి సంబంధిత పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

# 'ది ప్యారడైజ్'కు 800కు పైగా ప్రీమియర్ షోలు

**హైదరాబాద్, సెప్టెంబరు 17 (తెలంగాణ ముచ్చట్లు):** నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సెప్టెంబరు 23న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 800కు పైగా ప్రీమియర్ షోలను ప్రదర్శించేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను విడుదలకు ముందే పెద్ద సంఖ్యలో ప్రీమియర్ షోలతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. సినిమా విడుదల తర్వాత ఎలాంటి స్పందన వస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in